క్లుప్తంగా

ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా



గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): గ్రామంలో విద్యుత్ స్తంభాలు కొత్తవి వేస్తున్న కారణంగా తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో గ్రామస్తులకు తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పంచాయతీ అధికారులు శుక్రవారం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సర్పంచి నక్కా కమల, నాయకులు సుధాకర్, బారు అచ్యుతరావు దగ్గరుండి తాగునీటి సరఫరాను పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



జగ్గయ్యపేట: మండలంలోని షేర్‌మహ్మద్‌పేటలోని పోలింగ్ కేంద్రాన్ని విజయవాడ రూరల్ డీసీపీ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగనున్న ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో తగుజాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహిస్తూ, ఓటర్లకు మరింత ధైర్యం కల్పిస్తున్నామన్నారు. రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తున్నట్లు వివరించారు. డీసీపీ వెంట నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్, జగ్గయ్యపేట సీఐ జానకీరామ్, ఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.4.56 లక్షలు స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కనకదుర్గ వారధి చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం నిర్వహించిన సోదాల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.4లక్షల 56వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణలంక పోలీసుల కథనం మేరకు... గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రాంతానికి చెందిన పి.శివశంకర్ విజయవాడ నగరంలోని ఒక థియేటర్ వద్ద వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఒక కారులో గుంటూరు వైపు నుంచి వారధి మీదుగా నగరానికి బయలుదేరాడు. వారధి చెక్ పోస్ట్ వద్ద పోలీసులు ఆ కారును తనిఖీ చేసి అతని వద్ద రూ.3 లక్షల 56 వేలు నగదు ఉన్నట్లు గుర్తించారు. అలాగే గుంటూరులోని బృందావన్ గార్డెన్‌కు చెందిన రియాల్టర్ కర్నాటి నాగేశ్వరరావు తన కారులో శుక్రవారం సాయంత్రం గుంటూరు నుంచి వారధి మీదుగా నగరానికి బయలుదేరాడు. వారధి చెక్ వద్దకు రాగానే పోలీసులు కారును తనిఖీ చేసి రూ.లక్ష ఉన్నట్లు గుర్తించారు. వారిద్దరూ ఆ నగదుకు ఎలాంటి బిల్లులు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమైక్యతకు నిలయంగా ఇఫ్తార్ విందు



లబ్బీపేట(విజయవాడతూర్పు):రంజాన్ మాసంలో సమైక్యతకు నిలయంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తుంటారని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రఫీఖ్ అన్నారు. ఆ సంస్థ తూర్పుశాఖ ఆధ్వర్యంలో లబ్బీపేటలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎండీ రఫీఖ్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలోనే విశ్వమానవాళికి మార్గదర్శకత్వం కోసం దివ్య ఖురాన్ అవతరించినట్లు తెలిపారు. ఈ భౌతిక జీవితంలో ఆరాధనలు, ఆధ్యాత్మికత ద్వారా మాత్రమే శాంతి సుఖాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ కరీముద్దీన్, ఇస్మాయిల్ ఉమ్రీ, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా..కొణతాలపల్లి

- రూ.3కోట్లతో అభివృద్ధి పనులు..
- సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు రూ.23.89కోట్ల మేర లబ్ధి
- మెరుగుపడిన మౌలికవసతులు
- హర్షం వ్యక్తంచేస్తున్న కొణతాలపల్లి గ్రామస్తులు



కొణతాలపల్లిలోని సచివాలయ భవనం

కొణతాలపల్లి(వీరులపాడు): మండల పరిధిలోని కొణతాలపల్లి గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గత టీడీపీ పాలకుల పాలనలో నిరాదరణకు గురై కనీసవసతులకు సైతం నోచుకోని వీరులపాడు మండలం కొణతాలపల్లి ఈ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చెందింది. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొణతాలపల్లి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాభివృద్ధికి నిధులు మంజూరుచేసి అభివృద్ధి పనులు చేపట్టింది. దీంతో కొణతాలపల్లిలో మౌలికవసతులు మెరుగుపడ్డాయి.

రూ.40లక్షలతో సిమెంటురోడ్లు..

కొణతాలపల్లి, పల్లంపల్లి గ్రామాల్లో రూ.40లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ.నాలుగు లక్షలతో కొణతాలపల్లి నుంచి చౌటపల్లికి వెళ్లే డొంకరోడ్డును అభివృద్ధి చేశారు. గ్రామంలో రూ.40లక్షలు వెచ్చించి ఆయా కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.

ఆలయానికి రూ.92లక్షలు మంజూరు..

గ్రామంలోని శ్రీమల్లికార్జునస్వామి వారి పురాతన ఆలయ పునర్నిర్మాణం కోసం రాష్ట్రప్రభుత్వం దేవాదాయశాఖ ద్వారా రూ.92లక్షలు మంజూరు చేసింది. పురాతన ఆలయానికి పునర్వైభవం తెచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.92లక్షలు మంజూరు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అదేవిధంగా వైఎస్సార్ జలకళ పథకం కింద గ్రామానికి చెందిన 20మంది రైతుల పంట పొలాల్లో బోర్లు వేశారు.

డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా 23.89 కోట్ల మేర లబ్ధి..

గ్రామంలో 4,600 మంది జనాభా ఉండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఆయా సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు డీబీటీ, నాన్ డీబీటీ పద్ధతిలో రూ.23.89కోట్ల లబ్ధి చేకూరింది.

70మందికి ఇళ్లస్థలాలు..

ముఖ్యంగా నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం జగనన్న కాలనీని ఏర్పాటు చేసి 70మందికి ఇళ్లస్థలాలు పంపిణీ చేసింది. ఇందుకోసం రూ.36లక్షలు వెచ్చించి రైతుల నుంచి భూమిని కొనుగోలు చేసి మరీ ఇళ్లస్థలాలను అందజేసింది. ఇళ్లస్థలాల పంపిణీతోపాటు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు ప్రత్యేకంగా శ్రద్ధతీసుకుని వారందరికీ ఇళ్లు కూడా మంజూరు చేయించడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకున్నారు. దీంతో పేదల సొంతింటి కల నెరవేరింది. ఇలా నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు కృషితో ఈ ఐదేళ్లలో తమ గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని కొణాతాలపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రూ.40లక్షలతో సచివాలయ నిర్మాణం..

గ్రామంలో రూ.40లక్షలతో గ్రామసచివాలయాన్ని నిర్మించారు. మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.15లక్షలు కేటాయించారు. ఈనిధులతో పాఠశాలలో అదనపు తరగతి గదులు, మంచినీటి వసతి, మరుగుదొడ్ల సదుపాయం, డెస్కులతో కూడిన బల్లలు ఏర్పాటు చేశారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా వసతులు మెరుగుపరిచడంతో విద్యార్థుల సంఖ్య కూడా బాగా పెరిగింది.



గ్రామంలో నిర్మించిన సిమెంటురోడ్డు



సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసిన అంతర్గత రోడ్డు

మునుపెన్నడూలేని అభివృద్ధి..



గత ప్రభుత్వాల హయాంలో గ్రామాన్ని పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక మునుపెన్నడూ చూడని అభివృద్ధి కనిపిస్తోంది. సచివాలయ భవనం నిర్మించడంతోపాటు కాలనీల్లో నూతన విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేశారు. డొంకరోడ్లను అభివృద్ధి చేశారు.

–అయిలూరి నర్సిరెడ్డి, గ్రామస్తుడు

సంక్షేమంతో ఆదుకున్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి అండగా నిలుస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి దాదాపుగా సంక్షేమ పథకాలు అందాయి. డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.23.89 కోట్లు గ్రామస్తులకు అందాయి. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

–నంద్రు సౌజన్య, సర్పంచి



జగనన్న కాలనీలోని ఇళ్లు

ప్రజలకు ఎల్లప్పుడు మంచే చేస్తా



నందిగామ నాలుగోవార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నాకు ఓటేస్తే మంచి చేస్తానని మిగిలిన రాజకీయపార్టీల నాయకుల మాదిరిగా చెప్పడం చేతకాదని..నాకు ఓటు వేసినా వేయకపోయినా నావంతుగా ప్రజలకు ఎప్పుడూ మంచే చేస్తానని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని నాలుగు, ఒకటోవార్డు పరిధిలోని మెయిన్ బజార్, కుమ్మరిబజార్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు చేసిన మేలును వివరించారు. పట్టణంలో ఈ ఐదేళ్ల చేసిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన డాక్టర్ జగన్‌మోహనరావుకు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు.

రెవెన్యూ డివిజన్ కల సాకారం..

ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నందిగామను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామన్నారు. నందిగామ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి రెవెన్యూ డివిజన్ కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నా ఐదేళ్ల పాలనలో సాకారం చేశానని గుర్తుచేశారు. గతంలో చిన్నపాటి రెవెన్యూ సమస్యపై కూడా మచిలీపట్నం వెళ్లాల్సిరావడంతో ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకు గురయ్యారని, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని గత పాలకులను ప్రజలు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెవెన్యూ డివిజన్ కలను సాకారం చేసిందని, గత పాలకులు ఆపని ఎందుకు చేయలేకపోయారో ఆలోచించాలని ప్రజలను కోరారు. ముఖ్యంగా మంచి చేస్తున్నా కూడా అడ్డుకుంటున్న ప్రతిపక్ష పార్టీని బహుశా నందిగామలోనే చూసి ఉంటామని ఎద్దేవా చేశారు.

గత ఎన్నికల్లో నాపై నమ్మకంతో అండగా నిలిచిన ప్రజలందరి ఆశయాలకనుగుణంగా పని చేశానని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి ప్రజల ముందుకు సగర్వంగా వస్తున్నామని చెప్పారు. నందిగామ ప్రజలు చూపుతున్న ఆదారాభిమానాలు మరువలేనివంటూ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు ఓర్సు లక్ష్మీ, పాకలపాటి కిరణ్, నాయకులు మువ్వల శ్రీను, నల్లమల్లి మురళి, సూరె రామారావు, పరిశ మల్లి, సముద్రాల మధు, పాములపాటి రమేష్, తోట అంజారావు, గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, జాఫర్, ఓర్సు జ్వాలా, మార్త శ్రీను, ఫాతిమా, బండారు శేషు, కరి రవీంద్ర, కొండ, షేక్ సుభాని, కార్యకర్తలు పాల్గొన్నారు.



నందిగామ అభివృద్ధికి సంబంధించిన కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

నందిగామ టౌన్: ఏసుక్రీస్తు జీవితం సకల మానవాళికి ఆచరణ మార్గమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే వేడుకలను నందిగామ నియోజకవర్గంలో క్రైస్తవులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. నందిగామలోని ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు, సిలువమార్గం, శాంతి ర్యాలీలో ఎమ్మెల్యే నిర్వహించారు. దీనిలో భాగంగా ముందుగా ఎమ్మెల్యే జగన్ మోహనరావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు మాట్లాడుతూ అందరూ తోటివారితో ప్రేమ, దయతో మెలగడంతోపాటు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు.

చందర్లపాడులో..

గుడ్‌ఫ్రైడే వేడుకలను పురస్కరించుకుని చందర్లపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువ మార్గం నిర్వహించారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్ : గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం జగ్గయ్యపేట పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువమార్గం ప్రదర్శనను నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గుడిసె జయరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, సంఘ పెద్దలు పాల్గొన్నారు. సీఎస్ఐ సెయింట్ థామస్ టౌన్ చర్చిలో డీసరీ చైర్మన్ ఎస్.పాల్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో ఎవాంజలిస్ట్ దార విజయలక్ష్మి, చర్చి కమిటీ ప్రతినిధులు, ఉమెన్స్ ఫెలోషిప్, సండేస్కూల్, యూత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. కాకానినగర్‌లోని క్రైస్ట్ చర్చిలో పాస్టర్ ఎ.విజయరావు, బలుసుపాడు రోడ్డులోని బేతేలు చర్చిలో బిషప్ జాన్‌బాబు, విలియంపేటలోని సీఎస్ఐ చర్చి, జిజిఎఫ్ మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ జోసఫ్ కిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలా భాను పాల్గొని ప్రత్యేక ప్రార్థనల్లో సిలువమార్గంలో పాల్గొన్న భక్తులకు మజ్జిగ పాకెట్లు, కొబ్బరి నీళ్ల పంపిణీ చేయించారు.



జగ్గయ్యపేటలో శిలువమార్గం ర్యాలీలో క్రీస్తు శ్రమల ప్రదర్శన

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పొన్నవరం గ్రేస్‌బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్లు గొర్రెపాటి రత్నం, ఇమ్మానియేలు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్పంచి షోడగిరి రాజశ్రీ, షోడగిరి సతీష్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బోడవాడ–జమ్మవరం విచారణ పరిధిలోని పరిశుద్ధ లూర్దుమాత ఆలయంలో ఫాదర్ సాలె వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, శిలువ మార్గం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు నన్నెబోయిన తిరుమలరావు, యాదాల దాసు, కర్ల రాణి, కర్ల రాజు పాల్గొన్నారు. జగన్నాధపురంలోని నిత్య సహాయమాత ఆలయంలో నిర్వహించిన ప్రార్థనల్లో ఫాదర్ సుగుణరావు, సర్పంచి బండి విజయ్‌పాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జ్ఞానారెడ్డి, నరసింహారెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు:జీసస్ మహాత్యాగానికి గుర్తు అయిన గుడ్‌ఫ్రైడే వేడుకలను మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జేజీఎం, షాలోమ్ చర్చిలతోపాటు ఆయాచర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. ముచ్చింతాల ఆర్‌సీఎం చర్చివారు పెనుగంచిప్రోలు నుంచి ముచ్చింతాల వరకు శిలువమార్గం నిర్వహించి, జీసస్ గీతాలు ఆలపించారు. చర్చి ఫాదర్ దేవకుమార్, పాస్టర్లు జోసఫ్ పాల్, ప్రభుదాస్, సంఘపెద్దలు పాల్గొన్నారు.



నందిగామలో శిలువమార్గంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కంచికచర్లలో శిలువను మోస్తున్న ఆర్‌సీఎం చర్చి ఫాదర్ దత్తు

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: గుడ్‌ఫ్రైడే వేడుకలను కంచికచర్ల మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పేరం దత్తు, క్రైస్తవ యువకులు, మహిళలు, విశ్వాసులు క్రీస్తు సిలువను పురవీధుల్లో మోశారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి : గుడ్‌ఫ్రైడే వేడుకలను వత్సవాయి మండలంలోని ఆయా గ్రామాలలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దబ్బాకుపల్లిలో క్రీస్తు అనుభవించిన శ్రమలను గుర్తుకు తెచ్చుకుంటూ శిలువమార్గాన్ని నిర్వహించారు.

సంభంగి వాసుకు నాయకుల నివాళి



వాసు అంతిమయాత్రలో పాల్గొన్న వెంకట కృష్ణప్రసాద్, చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: నర్సీపట్నం రోడ్డు సమీపంలో రైలుబోగీలో నుంచి ప్రమాదవశాత్తు పడిపోయి మృతిచెందిన పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ సంభంగి శ్రీనివాసరావు (వాసు) భౌతిక కాయాన్ని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. తునిలో రైల్వే ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి అయిన తర్వాత వాసు భౌతిక కాయాన్ని శుక్రవారం జగ్గయ్యపేట అయ్యప్పనగర్‌లోని ఆయన స్వగృహానికి తరలించారు. వాసు భౌతిక కాయాన్ని వైఎస్సార్ సీపీ యువనేత సామినేని వెంకటకృష్ణప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్‌చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు పందుల రోశయ్య, కాశి కిషోర్, దువ్వల రామకృష్ణ, పూసాల పుల్లారావు, కాంట్రాక్టర్లు, మున్సిపల్ ఉద్యోగులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఉదయభాను..

అంతకుముందు అంబులెన్స్‌లో జగ్గయపేటకు వస్తున్న కాంట్రాక్టర్ సంభంగి శ్రీనివాసరావు (వాసు) భౌతికకాయాన్ని పేటలో ఎమ్మెల్యే, సామినేని ఉదయభాను సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తనప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

దుర్గమ్మ భక్తులకు మజ్జిగ పంపిణీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఈవో రామారావు ప్రారంభించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం ఎదుట దేవస్థాన ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం భక్తులకు మజ్జిగ పంపిణీ జరుగుతుంది. తొలి రోజైన శుక్రవారం ఆలయ ఈవో రామరావు కుటుంబం పేరిట 5 క్యాన్‌ల మజ్జిగను భక్తులకు వితరణ చేశారు.

బోనమెత్తిన భక్తజనం



బోనాలు సమర్పించేందుకు వెళ్తూ నృత్యాలు చేస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు:శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం భక్తుల బోనాలతో ఘనంగా ముగిసింది. భక్తులు స్థానిక మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. తొలి బోనం ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు అమ్మవారికి సమర్పించారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలతోపాటు క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఉత్సవాల్లో ఐదు రోజులపాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందిగామ ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో సీఐ జానకిరామ్ పర్యవేక్షణలో ఎస్ఐ పి రాంబాబు బందోబస్తు నిర్వహించారు. తిరునాళ్లలో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దేవస్థాన అధికారులు, గ్రామంలో సర్పంచి వేల్పుల పద్మకుమారి పర్యవేక్షణలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టి భక్తులకు ఇబ్బంది లేకుండా చూశారు.



క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు



అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు